క్లుప్తంగా

ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పాలెం గురుమూర్తి రెడ్డి, జిల్లా నైపుణ్య అధికారి విజయ్ వినీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చిన అనంతరం ఉపాధి కల్పించడం ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని వారు వివరించారు. మరిన్ని వివరాలకు 8886297300 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాచమల్లుకు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న తుపాకుల వెంకటరమణ

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ ప్రకాష్ నగర్‌కు చెందిన పూసల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణను వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ఉప్పర మురళి, చౌడం రవి, ఏపీ పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంభం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు అధ్వానం



హాస్టల్ విద్యార్థులతో నేట్లపల్లె శివరాం

మైదుకూరు : మైదుకూరులోని సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లె శివరాం అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మైదుకూరులోని బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను పరిశీలించారు. ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో 80మంది విద్యార్థులకు ఒకే బాత్‌రూమ్ ఉందని, అదీ శిథిలావస్థకు చేరిందని తెలిపారు. మెనూ సక్రమంగా అమలు కావడంలేదని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన బ్యాగ్‌లు అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన బ్యాగ్‌లు నాణ్యతతో ఉన్నాయని విద్యార్థులే చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించి సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కలాం, జకరయ్య, నరసింహారెడ్డి, గురుచైతన్య, కుమార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ సమావేశం

బ్రహ్మంగారిమఠం : బద్వేల్‌లో సోమవారం నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు అజయ్ కోరారు. బి.మఠంలోని వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం సమావేశ కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక రూపొందించేందుకు ప్లీనరీ జరుగుతోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, షరతులు లేకుండా తల్లికి వందనం డబ్బు జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల, అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, దేవకుమార్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

ప్రొద్దుటూరు : ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిలబెట్టుకోవాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరు పెయింటర్స్ యూనియన్ సమావేశం మేస్త్రీలు నాగేంద్ర, సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న ఓబన్న మాట్లాడుతూ ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంక్షేమ బోర్డును ప్రారంభించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టామన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు పోస్టుకార్డులను పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు మత్తయ్య, ప్రసాద్ రావు, దాసు, మహబూబ్‌బాషా, గడ్డం రవి, శ్యామ్, కుమార్, చిన్న, బాషా పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్‌బాషా



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్‌బాషా ఆరోపించారు. మైదుకూరు పట్టణంలోని 23వ వార్డు ఇందిరమ్మ కాలనీలో బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంజాద్‌బాషా, శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. ఆయన ప్రజలకు చేసిన మోసాన్ని ఎండగట్టారు. అర్హత ఉండి పింఛన్ రాని వారితో మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను కాలనీ వాసులకు గుర్తు చేయగా తమకు ఎలాంటి పథకాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు 143 హామీలను ఇచ్చారని, అందులో ముఖ్యమైనవి సూపర్ సిక్స్‌గా పేర్కొన్నారని, ఏ ఒక్కటీ అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని, మొన్నటి ఎన్నికల్లో ఆయన ఇచ్చిన హామీలను ప్రజలు ఆశతో నమ్మారన్నారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతులకు, డ్వాక్రా మహిళలకు, టైలర్లకు, ఆటో డ్రైవర్లకు, నాయీ బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండానే ప్రభుత్వ పథకాలను అందుకునేలా సేవలందించారన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పారని, 14 నెలల్లో ఒక్కొక్కరికి రూ.42 వేలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 18ఏళ్లు నిండిన వారికి రూ.1500 ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారని విమర్శించారు. నాలుగు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కటి ఇచ్చారని, చాలామంది ఖాతాల్లో ఆ డబ్బు పడలేదని ఆరోపించారు. ఉచిత బస్సు అని చెప్పి.. బస్సెక్కి డ్రైవర్‌కు తన పేరు చెప్పాలని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రైతులకు రూ.20వేలు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 66 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా, చంద్రబాబు వచ్చి రాగానే ఐదు లక్షల మందికి కోత పెట్టారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పథకాలు ఇవ్వకపోయినా కరెంటు బిల్లులు పెంచారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద పాఠశాలలు బాగుపడ్డాయని, విద్యార్థులకు అందించిన బ్యాగ్‌లు నెలకే చినిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లోనైనా మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే..

సంక్షేమం, అభివృద్ధి అనేవి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో ప్రజలకు చంద్రబాబు పట్టం కట్టారని, ఆశ చెడ్డది కాబట్టే ప్రజలందరూ చంద్రబాబు హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కి పథకాలకు మంగళం పాడారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఆడ బిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామని చంద్రబాబు హామీ ఇవ్వగా ఇప్పుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని ఓ మంత్రి చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా కులాలు, మతాలు, పార్టీలకతీతంగా పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అమలయ్యేలా చేశారని కొనియాడారు. వైఎస్ హయంలో ఇందిరమ్మ కాలనీలు, జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జగనన్నకాలనీలు నిర్మించగా ఎక్కడైనా చంద్రబాబు కాలనీ అనేది ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ వార్డు ఇన్‌చార్జి ఎస్.ఖాదర్‌బాషా, నాయకుడు షేక్ ఖాదర్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంఆర్‌ఎఫ్ సుబ్బయ్య, భరత్ కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు అన్నలూరు శ్రీనివాసులరెడ్డి, గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, గోశెట్టి లక్ష్మయ్య, రైతు విభాగం నాయకుడు నాగిరెడ్డి, భూమిరెడ్డి సుబ్బరాయుడు, మైనారిటీ నాయకులు ఖాదర్, ట్రాక్టర్ గౌస్, మాబు చాన్, జమాల్, కందనూరి షరీఫ్, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు సరే.. అమలు చేసేదెప్పుడు?



అట్లూరు : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : హామీలైతే ఇచ్చారు అధికారంలోకి వచ్చారు మరి అమలు చేసేదెప్పుడని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోవిళ్ళచిన్న సూరారెడ్డి ప్రశ్నించారు. మండల పరిధిలోని వరికుంట పంచాయతీ పరిధిలోని వరికుంట, కలావాండ్లపల్లి, వరికుంట్ల ఎస్సీకాలనీ, వరికుంట మిట్టలలో బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలతో మమేకమై వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నమ్మి కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడితే అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలుచేయడం లేదని, దీంతో అన్నదాత సుఖీభవ కోసం రైతన్నలు, తల్లికి వందనం, మహిళా నిధి కోసం మహిళలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ రొండామాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు దున్నూతల బాలకృష్ణారెడ్డి, సింగనఓబుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అట్లూరుసుబ్బరాయుడు, నరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత



కాశినాయన: మిద్దెలలో కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశినాయన : కూటమి పాలనపై ప్రతి ఇంటా వ్యతిరేకత కనిపిస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం వాటి ఊసే ఎత్తడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ సమన్వయ కర్త రమణారెడ్డి, మండల కన్వీనర్ హనుమంతు రెడ్డిలు విమర్శించారు. బుధవారం మండలంలోని మిద్దెల గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఏ మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కొత్త పింఛన్లు, తల్లికి వందనం కొందరికే తప్ప, ఏ పథకం అందలేదని ప్రజలు తెలిపారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ పథకం కింద నెలకు రూ.1500, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పింఛన్, ఫ్రీ బస్సు, విద్యార్థులకు వసతి, విద్యా దీవెన పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, గంటా రమణారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎల్లయ్య, ఓబయ్య, నారాయణ, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ఇంటింటి ప్రచారం



కలసపాడు: కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : మండలంలోని ఈ.రామాపురం గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కూటమి నాయకులు అన్యాయంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.సుదర్శన్, అంకన గురివిరెడ్డి, సుధ రామకృష్ణారెడ్డి, నారాయణ యాదవ్, పుత్తా రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏవీ భాస్కర్‌రెడ్డి, జె.సింగరయ్య, బి.మధుసూదన్ రెడ్డి, సురేష్, అంకిరెడ్డి, బాలుడు, అనిల్, నారాయణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బారి నుంచి కాపాడాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ ఎ.చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కలను తరలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గతంలో అనేక పర్యాయాలు మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట వృద్ధులు, మహిళలు, చిన్నారులు కుక్కకాటుకు గురవుతున్నారని, అన్నారు. ఇప్పటికైనా పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలను తరలించేలా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాలి బాటలతో చీడ పీడలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఏడీఏ అనిత

ప్రొద్దుటూరు రూరల్ : వరి పంటలో కాలిబాటలు తీయడం వల్ల చీడపీడల ఉధృతికి అడ్డుకట్ట వేయవచ్చని ఏడీఏ అనిత పేర్కొన్నారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో వరి నాటి 20 రోజుల దశలో ఉన్నప్పటికీ వాటిలో ఎదుగుదల కనిపించడం లేదన్నారు. భూ సారాన్ని అనుసరించి ఎరువుల వాడకం చేపడితే పంటలు ఆశాజనకంగా ఉంటాయన్నారు. యూరియాను పంటల దశలలో మూడు సార్లు మాత్రమే వినియోగించాలన్నారు. వరి పిలకల దశలో, పొట్ట దశలో 20 కేజీల యూరియాకు, 16 కేజీల పొటాష్ ఎరువులను ఎకరా పంటకు పైపాటుగా వేయాలన్నారు. అధిక రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. రెండు రోజుల్లో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు యూరియా సరఫరా జరుగుతుందన్నారు. ఆత్మ బీటీఎం చెన్నకేశవులు పొలంబడి, రైతు విజ్ఞాన యాత్రలు, ప్రదర్శన క్షేత్రాలు, రైతు శిక్షణలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి మార్గదర్శకాలు వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వీఏఏ పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

కాశినాయన : వరి సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబాటలు సాధించవచ్చని వ్యవసాయాధికారి చంద్రమోహన్, ఏఈఓ రవి తెలిపారు. బుధవారం అక్కంపేట, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు రామచంద్రాపురంలో వరి నాటే విధానాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వరి పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే గాలి వెలుతురు సోకి మొక్క గంటకట్టి దిగుబడి పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.

వడ్డెరలకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి

అట్లూరు : ఎస్సీ, ఎస్టీల మాదిరిగా వడ్డెరలకు కూడా సామాజిక రక్షణ చట్టం ప్రభుత్వం అమలు చేసి వడ్డెరలకు, వడ్డెర మహిళలకు, పిల్లలకు, వృద్ధులకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరగదిండ్ల రమణయ్య, బత్తలగంగయ్య పేర్కొన్నారు. బుధవారం బద్వేలు పట్టణంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి వడ్డెర కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని, రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని తెలిపారు.

'పొలం పిలుస్తోంది' సద్వినియోగం చేసుకోవాలి

గోపవరం : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బేతాయపల్లెలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు ఏ మేరకు ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్న విషయాన్ని ఏఓ విజయరావును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్మీకంపోస్టు గుర్తించి రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ ద్వారా ఆగస్టు 2వ తేదీన రైతు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు ఓబయ్య, విజయ్, రైతులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి

చాపాడు: పంటలు సాగు చేసుకునే రైతులు పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో దేవీపద్మలత అన్నారు. మండలంలోని సిద్ధారెడ్డిపల్లె, నాగాయపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, వీఏఏ మాధవి,తదితరులు పాల్గొన్నారు.

పశువుల తొట్టె ఇలా.. దాహార్తి తీరేదెలా?



అయ్యవారిపల్లె సమీపంలో కేసీ కెనాల్ బంగ్లా వద్ద పశువుల దాహార్తి తీర్చే తొట్టి దుస్థితి

మురుగునీటి మధ్యలో కనిపిస్తున్న ఈ పశువుల తొట్టె మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ సమీపంలోనిది. కేసీ కెనాల్ బంగ్లా వద్ద ఆరేళ్ల కిందట ఈ తొట్టె నిర్మించారు. మేత కోసం వెళ్లిన పశువుల దాహార్తి తీర్చేందుకు ఇది ఉపయోగపడుతుందని ఏర్పాటు చేశారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రస్తుతం ఈ తొట్టె చుట్టూ మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. పశువులు దాహం తీర్చుకోలేని పరిస్థితి.

– చాపాడు

ఎమ్మెల్యేతోపాటు ఎంపీకి కూడా సీటు కేటాయించాలి

- క్లాప్‌ను కొనసాగించాలి
- ప్రైవేటు వ్యక్తులతో మార్కెట్ రుసుం వసూలు చేయిస్తున్నారు
- మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో సభ్యులు



వేదికపై మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వేదికపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌తోపాటు ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కూడా సీటు కేటాయించాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా డిమాండ్ చేశారు. ముగ్గురు నేతలు ఎక్స్‌అఫిషియో హోదాలో ఉన్నారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్లాప్ విధానం ద్వారా ఇంటింటికి వాహనాలను పంపి కసువు సేకరణ చేయడంతో పట్టణం పరిశుభ్రంగా ఉండేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్తపన్ను మినహాయించారని, అయితే చెత్తను మాత్రం తొలగించడం లేదన్నారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే చెత్త పన్ను చెల్లించి వాహనాలను పునరుద్ధరిస్తామని నాయకులు ఇచ్చిన హామీ ఏమైందని ఆమె ప్రశ్నించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ భారత్ అంటే ఇదేనా అని అన్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా దుర్వాసన వస్తోందని, దోమల నివారణకు గత ఆరు నెలల్లో తీసుకున్న చర్యలను తెలపాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లతోపాటు కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఈ విషయంపై డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ నిధులతో సిరిపురి కాంప్లెక్స్ నిర్మించి ప్రతి నెల రూ.2లక్షలు ఆదాయాన్ని మున్సిపాలిటీకి సమకూర్చామని, అదే తరహాలో మున్సిపల్ పెట్రోల్ బంక్ పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో మున్సిపల్ భవనాలను నిర్మించి లీజుకు ఇవ్వాలని బంగారు మునిరెడ్డి కోరారు. రూ.లక్ష కాంట్రాక్టు పనులకు సంబంధించి రూ.2వేలు లెస్ వేశారని పనులను రద్దు చేయడం తగదని మున్సిపల్ వైస్ చైర్మన్లతోపాటు కౌన్సిలర్లు ఇర్ఫాన్ బాషా, జిలాన్ తెలిపారు. అలా రద్దు చేసే విధానం ఉందా అని ప్రశ్నించారు. సింగిల్ టెండర్ కోడ్ చేస్తే రద్దు చేసే అధికారం తమకు ఉందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. ఎండీయూల వ్యవస్థ లేక రేషన్ తీసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గరిశపాటి లక్ష్మీదేవి తెలిపారు. పారిశుధ్య నివారణలో భాగంగా పందులను నివారించేందుకు ఏ చర్యలు తీసుకున్నా తామంతా సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ వైస్ చైర్మన్లు తెలిపారు. మార్కెట్‌లో మున్సిపల్ ఉద్యోగులను కాదని ప్రైవేటు వ్యక్తులచేత ఎలా రుసుం వసూలు చేయిస్తారని సభ్యులు ప్రశ్నించారు. ఈ విధానం వలన కొంత డబ్బు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళతోందని, ఇందుకు బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్లు కోరారు. రోజూ రూ.50వేలకు పైగా వసూలు రావాల్సి ఉండగా ఆదాయం తగ్గిపోతోందన్నారు. టూటౌన్ బైపాస్ రోడ్డులోని పార్కులో మరుగుదొడ్లు నిర్మించాలని సభ్యులు కోరారు. వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరినందుకైనా కౌన్సిలర్ జిలాన్ అభ్యర్థనను మన్నించి మరుగుదొడ్లను నిర్మించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. పారిశుధ్యానికి సంబంధించి తమ వార్డులో ఉన్న సిబ్బందిని తొలగించారని కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5కోట్లను వచ్చే ఏడాది మార్చిలోపు ఖర్చు చేయాల్సి ఉందని సభ్యులు అడిగిన ప్రశ్నకు మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసులు సమాధానం తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన మున్సిపాలిటీలో మేనేజర్, అసిస్టెంట్ కమిషనర్, ఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండటం దురదృష్టకరమని బంగారు మునిరెడ్డి కమిషనర్‌కు తెలిపారు. ఆర్‌ఓ స్థానంలో ఆర్ఐనే విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఇంత పెద్ద మున్సిపాలిటీకి కింది స్థాయి అధికారులు లేని కారణంగా కమిషనర్‌పైనే భారం పడుతోందన్నారు. నగర దీపికలను కొనసాగించేందుకు చేసిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. ఇటీవల చేసిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీఓ మేరకు ఇంజనీరింగ్ కార్మికుల వేతనాన్ని రూ.21,500 నుంచి రూ.24,500 పెంచేందుకు ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు.